RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

| Malkajgiri | Volume: 3 | Issue: 87 | Thursday, July 10, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 87 | గురువారం, జూలై 10, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4/- |

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

## - మోడీ గిఫ్ట్ కు కేంద్రమంత్రి బండి శ్రీకారం




**కరీంనగర్ :** టెన్త్ చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమానికి కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. మొత్తం 20వేల సైకిళ్లను స్వంత నిధులతో కొనుగోలు చేసిన బండి వాటిని దశల వారీగా పంపణీ చేసే కార్యక్రమాన్ని నేడు చేపట్టారు. తొలుత కరీంనగర్ టౌన్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్ల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తో పాటు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్వినీ, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజీపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ మేయర్లు, డి.శంకర్, సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, ఆర్డీవో, డీఈవోతోపాటు పలువురు అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ... ఈ సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చిందే జిల్లా కలెక్టర్ అని అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని కలెక్టర్ ప్రతిపాదించారని చెప్పారు. ఆ ఆలోచనతోనే ఈరోజు టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇవి ప్రభుత్వ నిధులు కావని, అలాగే తాను కోట్లు ఖర్చు పెట్టేంత సంపన్నుడిని కాదని అంటూ తన దగ్గరకు వచ్చిన కొందరు కార్పొరేట్ కంపెనీల యాజమానులను మీరు సంపాదించిన సొమ్ములో కొంత సీఎస్సార్ ఫండ్ కింద ఇవ్వాలని కోరితే వారు సానుకూలంగా స్పందించి ఆ నిధులు అందిస్తే వాటితో సైకిళ్లను కొని మీకు పంపిణీ చేస్తున్నానని చెప్పారు.

**త్వరలో మోడీ గిఫ్ట్...**

అతిత్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అతి త్వరలో "మోదీ కిట్స్"ను అందజేయబోతున్నామని బండి చెప్పారు.. ఎన్ని వేల మంది ఉన్నా, ఎన్ని లక్షల మంది ఉన్నా వాళ్లందరికీ మోదీ కిట్స్ ను అందిస్తామని పేర్కొన్నారు.. తల్లిదండ్రులు ఎంతో పేదరికంలో ఉంటూ మిమ్ముల్ని కష్టపడి చదివిస్తున్నారని, భవిష్యత్తులు ఉన్నత స్థానంలోకి రావాలని కలలు కంటున్నారన్నారు.. వారి శ్రమను దృష్టిలో ఉంచుకుని తలదించుకుని చదవాలని, బాగా చదివి తల ఎత్తుకు తిరిగేలా బతకాలని విద్యార్థులను కోరారు.

## పెట్టుబడులు రాకుండా ఈ మెయిల్స్ తో వైసిపి కుట్ర

## - విచారణకు చంద్రబాబు ఆదేశం



**వెలగపూడి :** ఎపి బ్రాండ్ దెబ్బ తీసేలా వివిధ సంస్థలకు ఈ మెయిల్స్ పెట్టడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. పెట్టుబడులు అడ్డుకునేలా వైసీపీ చేస్తున్న కుట్రలపై విచారణ చేయిస్తామని సీఎం ప్రకటించారు. అమరావతిలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వైసీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ.. పెట్టుబడులు అడ్డుకునేలా ఆయా సంస్థకు మెయిల్స్ చేస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఏపీఎండీసీ జారీ చేసిన బాండ్లల్లో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఏకంగా 200 దేశ, విదేశీ కంపెనీలకు తప్పుడు ఈ మెయిళ్లు పెట్టారని ఆర్థిక మంత్రి పయ్యావుల సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీనే తమ పార్టీ సానుభూతిపరులతో ఈ మెయిళ్లు పెట్టించిందని సీఎంకు ఆధారాలు చూపించారు పయ్యావుల. తప్పులు చేసి.. ఆ తప్పులను ప్రత్యర్థుల మీదకు నెట్టేయడమనే కుట్రలను మొదటి నుంచి వైసీపీ అమలు చేస్తూనే ఉందన్నారు సీఎం. నిధులు రాకుండా తెర వెనుక అడ్డుకోవడం.. పథకాలు అమలు చేయడం లేదని ప్రజల్లో దుష్ప్రచారం చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మంత్రులకు ముఖ్యమంత్రి సూచించారు.

## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి.. కుటుంబ సభ్యుల ఆందోళన

**తొర్రూరు :** అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం... నియోజకవర్గంలోని కొడకండ్ల మండలానికి చెందిన పొన్నం పాండురంగ (75) కడుపు నొప్పితో బాధపడుతుండగా సుప్రీత హాస్పిటల్ కు తీసుకొచ్చామని ఆస్పత్రిలో ఇంజక్షన్లు ఇచ్చి స్కానింగ్ తీసుకురమ్మని పంపించగా అక్కడికి వెళ్ళేసరికే మృతి చెందాడని ఆరోపించారు. తిరిగి మృతుడు పాండురంగ ను శృతి హాస్పిటల్ వద్దకు తీసుకువచ్చి బయట పడుకోబెట్టి ఆందోళనకు దిగారు. మృతికి పూర్తిగా కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో ఆస్పత్రికి చేరుకొని మృతికి కారణాలను తెలుసుకుంటున్నారు. బాధితులను ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. మృతుడు పాండురంగకు ఇద్దరు కొడుకులు, భార్య ఉన్నారు.



## మాసబ్ చెరువు - దిలావరాన్

## చెరువులను పరిశీలించిన హైడ్రా చీఫ్

హైదరాబాద్ : మాసంచెరువు - దిలావరాన్ - పెద్దఅంబర్పేట చెరువులను అనుసంధానం చేసే నాలాను ఒక మోడల్ గా తీర్చిదిద్దుతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. మొత్తం 7.50 కిలోమీటర్ల విస్తరించి ఉన్న ఈ నాలా పొడుగున చాలా అభివృద్ధి చెందాల్సిన పరిస్థితుల్లో.. ఇప్పుడు తగిన వెడల్పుతో నాలాను నిర్మిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని అన్నారు. రెవెన్యూ, జిహెచ్ఎంసి, ఇరిగేషన్ యిలా సంబంధిత శాఖలన్నిటితో సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని అన్నారు. మాసబ్ చెరువు - దిలావరాన్ చెరువుల మధ్య నాలా సరిగా లేక అనేక కాలనీలు నీట మునుగుతున్నాయనే పిర్యాదుల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి తో కలసి పలు ప్రాంతాలను బుధవారం కమిషనర్ పరిశీలించారు. మాసబ్ చెరువు - దిలావరాన్ చెరువుల మధ్య జాలికుంట పరిసరాల్లో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కమిషనర్ చూసారు. జాలికుంటలో కట్టడం వల్ల సెల్లార్లోకి నీళ్లు చేరడంతో ఆగిపోయిన నిర్మాణాలను పరిశీలించారు.



**పూర్తిస్థాయిలో నాలా అభివృద్ధి..**

చెరువుల మధ్య అనుసంధానంగా ఉన్న వరద కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు రంగనాథ్. ఇంకా పెద్దమొత్తంలో ఇళ్ళ నిర్మాణాలు జరగలేదు కనుక భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాలాను నిర్మించాల్సి ఉంటుందని సూచించారు. అలాగే చెరువుల ఆక్రమణ జరగకుండా చూడాలని అన్నారు. చెరువులలో మట్టిపోసి నింపినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెరువుల, నాలాలను మనం కాపాడుకుంటే వరదలకు ఆస్కారం ఉండదని హితవు పలికారు. మాసబ్ చెరువులో మట్టి పోసినవారిపై చర్యలుంటాయని అన్నారు. అనంతరం కర్మాంఘాట్, బడంగిగిపేట ఏరియాల్లో నాలా విస్తరణకు ఉన్న ఆటంకాలను పరిశీలించారు. కర్మాంఘాట్ ప్రాంతంలోని ఉదయ్నగర్ కాలనీలో నాలా విస్తరణ వెంటనే చేపట్టాలని సూచించారు. అలాగే రావిర్యాల చెరువును పరిశీలించారు. చెరువు పైభాగంలో నివాసాలు నీట మునుగుతున్న నేపథ్యంలో చెరువు అలుగులను పరిశీలించారు.

## నదిపై వంతెన కూలిన ఘటనలో 9 మంది మృతి..

**వడోదర:** గుజరాత్‌లో వడోదర జిల్లాలోని మహిసాగర్ నదిపై ఉన్న 45 ఏళ్ల నాటి గంభీర వంతెన కుప్పకూలడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఈ వంతెన కుప్పకూలిన ఘటనలో మృతుల సంఖ్య తమ్మిదికి చేరినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం వంతెన మధ్యలో ఒక భాగం కూలిపోయింది. వాహనాలు ప్రయాణిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో పలు వాహనాలు నదిలో పడిపోయాయి. ఈ సంఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని పద్రా పోలీసు ఇన్‌స్పెక్టర్ విజయ్ చరణ్ తెలిపారు. ప్రమాదానికి గురైన వాహనాల్లో రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు ఉన్నాయని తెలిపారు. సహాయక బృందాలు ఇప్పటివరకు 10 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయని. నదిలో చిక్కుకున్న ఇతర వ్యక్తుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. "స్థానిక ఈతగాళ్ళు, పడవలు, మున్సిపల్ కార్పొరేషన్ బృందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. NDRF బృందాలు, ఇతర పరిపాలన, పోలీసు బృందాలు



సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు 9 మృతదేహాలను వెలికితీశాము. ఆరుగురు గాయపడ్డారు. వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు" అని వడోదర కలెక్టర్ అనిల్ ధమేలియా తెలిపారు.

## మామిడి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి: జగన్



**అమరావతి:** ఎపి రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని మాజీ సిఎం వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. మామిడి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిత్తూరులోని బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు జగన్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మామిడి రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకు ఇక్కడికి వచ్చానని అన్నారు. కూటమి పాలనలో రైతులు కన్నీళ్లు పెడుతున్నారని, ప్రభుత్వమే రైతులపై కుట్రలు చేయడం దారుణం అని మండిపడ్డారు. రైతులను రాకుండా చేసేందుకు పోలీసులు మోహరించారని, రైతులను కలవకుండా ఎందుకు ఆంక్షలు పెడుతున్నారు? కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. అయినా వేలమంది రైతులు వచ్చి వారి ఆవేదన చెప్పుకున్నారని అన్నారు. రైతులను రౌడీషీటర్లతో పోలుస్తారా? అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని, కిలో మామిడి 2 రూపాయలా? ఇదేం దారుణం అని ఆశ్చర్యపోయారు. తమ హయాంలో రూ.22 నుంచి రూ. 29కి కొన్నామని, కర్ణాటకలో కిలో మామిడిని రూ.16 కి కేంద్రం కొంటుంటే... రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నాయుడు గాడిదలు కాస్తున్నారా? అని లక్షల మెట్రిక్ టన్నుల్లో మామిడి ఉందని బాబుకు తెలియదా? అని ఎద్దేవా చేశారు. మామిడి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సూచించారు. వెంటనే 76 వేల మంది రైతుల పంట కొనుగోలు చేయాలని, ప్రతి రైతుకు వైఎస్ఆర్ సిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతుల పక్షాన నిలబడి తానే ముందుండి పోరాడతానని తెలియజేశారు. రాష్ట్రంలో ఉంది పోలీసులా? రాక్షసులా? అని రైతుల తలలు పగలకొడతారా? 1200 మందిని జైల్లో పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రలోభాలు, లంచాలకు పోలీసులు లొంగొద్దు అని రేపు పోలీసులను కూడా చంద్రబాబు మోసం చేస్తారని హితవు పలికారు. వచ్చేది జగన్ ప్రభుత్వమే.. ఇది గుర్తు పెట్టుకోండి అని జగన్ సవాల్ విసిరారు.

# హక్కుల సాధనకు జర్నలిస్టుల ఐక్య పోరాటాలు

**- వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను కొనసాగించాలి - మీడియా రంగంలో పెట్టుబడిదారుల ప్రవేశం ప్రమాదకరం**

**- జర్నలిస్టులకు వేజ్ బోర్డు అమలు చేయాలి - టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**






**కుత్బుల్లాపూర్ , జులై 09: తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్:** హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలతో పాటు రెండు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను తొలగించేందుకు తీసుకుంటున్న చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాల రద్దుకు నిరసనగా కార్మిక సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్),హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే) సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద జర్నలిస్టుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్ యుజే అధ్యక్షుడు బి.అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం అమల్లో ఉందనీ, దానిని రద్దు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మీడియా సంస్థల్లో జర్నలిస్టులకు వేజ్ బోర్డు అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల పట్ల వివక్ష చూపటం మంచిది కాదని మామిడి సోమయ్య అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ,మీడియా రంగంలో కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, జర్నలిస్టుల హక్కులు హరించి వేస్తున్నారని అన్నారు. జర్నలిస్టులకు కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని, యాజమాన్యాలు వెట్టిచాకిరికి గురిచేస్తున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై అధ్యయనం, హక్కుల సాధన దిశగా జర్నలిస్టులు ముందుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్ యుజే అధ్యక్షులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టు చట్టం రద్దు ఆలోచనను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు పి. ఆనందం, బి రాజశేఖర్, కార్యదర్శులు ఇ.చంద్ర శేఖర్, సలీమా, గంద్ర నవీన్, హెచ్ యుజే కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు నాగవాణి, మధుకర్, విజయ, మాధవ రెడ్డి, కాలేబ్, వీరేశ్,వెంకట స్వామీ, సీనియర్ జర్నలిస్టులు రత్నాకర్ సురేష్,భాస్కర్, శశికళ, అజయ్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టు సంఘాలకు కార్మిక సంఘాల ధన్యవాదాలు కార్మికుల సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలిపిన టిడబ్ల్యూజేఎఫ్,హెచ్ యుజే జర్నలిస్టు సంఘాలకు పలు కార్మిక సంఘాలు ధన్యవాదాలు తెలిపాయి.సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ్మా, ఎంఎస్ నాయకులు రెబ్బ రామారావు లతో పాటు పలు కార్మిక సంఘాల నాయకులు జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మిక చట్టాలతో పాటు వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను సైతం కేంద్రం రద్దు చేస్తోందనీ, దీనిని సంఘటితంగా ఎదుర్కోవాలని కార్మిక నేతలు అన్నారు.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### అమెరికాకు తల ఒగ్గితే భవిత అయోమయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025 జులై 8వ తేదీ నాటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారతదేశానికి గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత బృందం, జేమీసన్ గ్రియర్ నేతృత్వంలోని అమెరికా బృందంతో వాషింగ్టన్‌లో 2 రోజుల చర్చలు జరిపింది. గోయల్ రెండు రోజుల క్రితం తిరిగి భారత దేశానికి వచ్చినప్పటికీ, వాణిజ్య కార్యదర్శి ఇంకా అమెరికాలో ఉన్నసమయంలో ట్రంప్ ఏకపక్షంగా భారతదేశంతో ఒక పెద్ద వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించాడు. ఇందులో భారతదేశాన్ని మరింత తెరవాలని స్పష్టమైన సందేశం ఉంది. అయితే వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఇది ట్రంప్ 2025 మే 10న ప్రకటించిన అమెరికా –మధ్యవర్తిగా ఇండో –పాక్ కాల్పుల విరమణ, దానితో అనుసంధానించిన అమెరికా– భారత వాణిజ్య ఒప్పంద ప్రకటన కొనసాగింపే. ఇది మరోసారి ఆర్ఎస్ఎస్ ప్రేరేపించిన మోడీ పాలన అమెరికా సామ్రాజ్యవాదానికి చేసిన దౌర్భాగ్యకర నయా వలసవాదానికి తలవంచే విధానాన్ని బయటపెడుతోంది. 2025 ఏప్రిల్ 2న ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా రక్షణాత్మక షరతులు, పరిమితులు విధిస్తూ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశంలో భాగంగా ఉక్కు, అల్యూమినియంలపై 26% పన్నులు విధించడమే కాకుండా, భారత్‌లో తమ మార్కెట్‌కు (%ఝితీనెవ్ ×అఒఋ%) అడ్డంకులు లేని ప్రవేశం కోసం డిమాండ్ చేశారు. ప్రపంచంలోని తూర్పున చైనా నుండి పశ్చిమ యూరప్, కెనడా వరకు పలు దేశాలు వెంటనే ప్రతిచర్యలు ప్రకటించాయి.లాటిన్ అమెరికా దేశాలు, ఆఫ్రికా దేశాలు కూడా ఈ ఏకపక్ష ట్రంప్ పన్నుల విధింపునకు వ్యతిరేకంగా గళమెత్తాయి. చైనా కౌంటర్ (ప్రత్యర్థిగా పన్నులుగా విధానానికి) టారిఫ్‌లకు ప్రతిచర్యగా ట్రంప్ చైనాతో రెండు దఫాల చర్చలతర్వాత వాణిజ్య ఒప్పందానికి వెళ్లాల్సి వచ్చింది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి మాటలు పలికే మోడీ మాత్రం ట్రంప్ ఏకపక్షంగా బెదిరించే పద్ధతిలో పన్నులను విధించటం గురించి ఏమీ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో భారతదేశంలో తక్కువ వేతనంతో పని చేసే రంగాలైన టెక్స్‌టైల్, రత్నాభరణాలు, చర్మవస్తువులు, వస్త్రాలు, ప్లాస్టిక్, రసాయనాలు, రొయ్యలు, నూనెగింజలు, ద్రాక్ష, అరటిపండ్లపై అదనపు 26% పన్నుల నుండి పూర్తి మినహాయింపు కోసం వేడుకుంటుంటే, అమెరికా మాత్రం అధునాతన సాఫ్ట్‌వేర్‌లు, పరిశ్రమల వస్తువులు, ఆటో లు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పెట్రో రసాయన ఉత్పత్తులు, వైన్, పాల ఉత్పత్తులు, ఆపిల్స్, ఇంతటితోనే కాకుండా జన్యుపరిణామం చేసిన పంటలపై డ్యూటీ మినహాయింపులు కోరుతోంది. ఈ ఒప్పందం ద్వారా 2025లో 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచాలన్నది లక్ష్యం. ఈ కొత్త ఒప్పందాన్ని 2025 జులై 8న ప్రకటించే అవకాశం ఉంది. స్వతంత్ర పరిశీలకుల ప్రకారం ట్రంప్ భారతదేశాన్ని మరింతగా తెరవాలి 'ఓపెన్ అప్ ఇండియా' అనేది 'స్టార్టప్ ఇండియా' చొరవను సూచిస్తుంది. ఇది స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రధాన కార్యక్రమం. వ్యవస్థాపకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని ఉద్యోగ సృష్టికర్తల దేశంగా మార్చడం దీని లక్ష్యం. ఈ చొరవ పన్ను మినహాయింపులు, నిధులకు సులభమైన ప్రాప్యత, మేధో సంపత్తి రక్షణకు మద్దతు వంటి వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. కొత్తప్రకటన ఆధారంగా మోడీ పాలన అమెరికా ఉత్పత్తుల కోసం ఎర్రతివాచి పరచడానికి సిద్ధమవుతోంది. 2020 నివేదిక ప్రకారం ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారతదేశం 190 దేశాలలో 63వ స్థానంలో ఉంది. 2014లో 142వ స్థానం నుండి ఇది గణనీయమైన మెరుగుదల. 2021లో ప్రపంచ బ్యాంకు ఈ నివేదికను నిలిపివేసింది. కానీ అప్పటి వరకు భారతదేశం సాధించిన పురోగతి నియంత్రణ సంస్కరణలకు, మరింత వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో దాని నిబద్ధతను హైలైట్ చేసింది. ఫలితంగా భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావంపడడం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ (ఎఐ)వంటి సాంకేతిక విధానాలలో భారత్ కష్టపడి సాధించిన పురోగతిని దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతాయి. సోయాబీన్, మొక్కజొన్న, ఆపిల్స్, పాలు మొదలైన వాటిపై అమెరికా ఒత్తిడి వల్ల వచ్చే కొత్త పన్ను మినహాయింపుల మొదటగా నష్టపోయేది,బలిపశువులు అయ్యేది రైతాంగమే.

# కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. సిఐటియు











**కుత్బుల్లాపూర్ జులై 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బాచుపల్లి ఏరియాలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఉద్యోగుల సమ్మె ర్యాలీ బాచుపల్లి మండల ఆఫీస్ నుండి చౌరస్తా మరియు పిఎస్ మీదుగా మున్సిపల్ వార్డు ఆఫీసు వరకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులుఎం. చంద్రశేఖర్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎన్ ఎల్లమ్మ అంగన్వాడి యూనియన్ సెక్టార్ నాయకురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధా నాలను సమ్మె విజయవంతం చేయడం ద్వారా ప్రతిఘటించామన్నారు. మున్సిపల్ కార్మికులను, అంగన్వాడి టీచర్స్ అండ్ వర్కర్స్ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 నిర్ణయించి అమలు చేయాలన్నారు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని గ్రాడ్యుటీ పెన్షన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చే పనిముట్లు సకాలంలో అందజేయాలని స్త్రీ పురుషులకు ఇచ్చే రైన్ కోట్స్ వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేతనాలు మొదటి వారంలో ఇస్తామని వాగ్దానం చేసి అమలు చేయటం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అంగన్వాడీలకు పని భారం తగ్గించి వారికి పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని మరియు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు యూనియన్ నాయకులు నరసింహ శ్రీను లక్ష్మి మరియు ఏఐటియుసి నాయకులు పి.శ్రీనివాస్, యాదయ్య, ఏ సి టి యు నాయకులు పి దస్తగిరి పాల్గొని సందేశాన్ని ఇచ్చారు.

# జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎం చోరీ











**కుత్బుల్లాపూర్ జూలై 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజు గౌడ్:** గ్యాస్ కట్టర్ తో ఏటీఎం మిషన్ కట్ చేసి క్యాష్ బాక్స్ ఎతుకుఎళ్లిన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి,మార్కండేయ నగర్ లో గల HDFC ఎటియం లో తెల్లారుజామున 3 గంటల ప్రాంతాల్లో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు,2 ద్విచక్రవాహనాలపై వచ్చి ఎటియం షెటర్ మూసి రెండు మిషన్లను గ్యాస్ కట్టర్ సహాయంతో కట్ జేసి 2 క్యాష్ బాక్స్ లను ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడుతున్న సన్నివేశాలు ఎటియం లోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. రెండు క్యాష్ బాక్స్ లలో కలిపి 30 లక్షలు నగదు చోరీకి గురైందని బ్యాంక్ సిబ్బంది పోలీసులు ఫిర్యాదు చేశారు. అయితే అదే కాలనీలో 5 గంటల ముందు బాల నగర్ ఏసీపీ ఆధ్వర్యంలో జీడిమెట్ల పోలీసులు నాకబంది నిర్వహించారు. దీనిని బట్టి దొంగలు గత కొద్ది రోజులుగా ఎటియం చోరీ చేసేందుకు గస్తీ నిర్వహించినట్లు గా భావిస్తున్నారు జీడిమెట్ల పోలీసులు, కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లావ్యాప్తంగా విజయవంతంగా ముగిసిన కార్మిక సంఘాల సమ్మె

**- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి యు ఎస్ ఎఫ్ ఐ**




**కుత్బుల్లాపూర్ జూలై 9 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెకు మద్దతుగా కుత్బుల్లాపూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ దగ్గర విద్యార్థులతో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం చంద్రకాంత్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ చికాగో నగరంలో అమరవీరుల రక్త తర్పణతో మేడే స్ఫూర్తిగా! కార్మికులు వంద సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలో బి.జె.పి. నాయకత్వంలో ఉన్న ఎన్.డి.ఎ. ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాల్గు లేబర్ కోట్లను తీసుకువచ్చింది. కార్పోరేట్ కంపెనీలకు కార్మికులను బానిసలనుగా మార్చే ఆ లేబర్ కోడ్ నల్ల డబ్బాలు అమలు చేస్తూ కార్మిక, కర్షక, ప్రజా హక్కుల అణచివేత, ప్రజా వ్యతిరేక కార్పొరేట్స్ అనుకూల విధానాల అసులును తీవ్రతరం చేయాలని చూస్తున్న కేంద్రంలోని బి.జె.పి. (ఎన్.డి.ఎ.) ప్రభుత్వంతోపాటు ఎన్.డి.ఎ. మద్దతులో ఏర్పడిన రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వెంటనే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మికులు చట్టాలను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఖుషి నాయకులు రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యకారులకు న్యాయం చేస్తా: ఎం.పి.ఆర్



**కాప్రా జూలై 9:** టి.పి.సి.సి. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓ.బి.సి.కన్వినర్, టి.యు.ఎఫ్.రాష్ట్ర కన్వినర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ( జె.ఏ.సి.)నాయకుడు గరిక సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం నాడు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యమకారులకు ఇచ్చిన హామీని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి.. తీసుకువెళ్లాలని మందమల పరమేశ్వర్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా ఎం.పి.ఆర్. మాట్లాడుతూ సి.ఎం. రేవంత్ అన్న దృష్టి కి తీసుకెళ్లి ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న ఉద్యమ కారుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ (జె.ఏ.సి.కన్వినర్) టి.యు.ఎఫ్. మీడియా కన్వీనర్ దొమ్మటి కిరణ్ కుమార్ రావు,బండ వినేష్ ఏరువా అశోక్,వినయ్ రెడ్డి, మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బోనాలకు సర్వం సిద్ధం భారీగా నిధులు మంజూరు

**- (ఆలయ కమిటీలకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ అద్దంకి, దయాకర్ ఇన్ ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డి)**



**కాప్రా జులై 9:** బోనాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనే రూ.20 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాలను జరుపుకునేందుకు ఆలయాల వద్ద కావాల్సిన ఏర్పాట్లకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే నిధులను మంజూరు చేస్తుందన్నారు.

ఉప్పల్ నియోజకవర్గంలోని 187ఆలయాలకు రూ.55,37,500 చెక్కులను బుధవారం ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ,కలిసి పంపిణీ చేశారు. ఎంజీఆర్ఐ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆయా ఆలయాల నిర్వాహకులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి EO వెంకన్న, ఆలయాల కమిటీ ప్రతినిధులు, దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆ రోడ్డుకు విముక్తి కలిపించిన హైడ్రా



**హైదరాబాద్ :** దారికి అడ్డుగా ఉన్న ఓ పెద్ద గోడ వేలాది ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఆ గోడ వల్ల వేల మంది ప్రజలు నిత్యం 5 కిలోమీటర్లు ఎక్కువ ప్రయాణించిన పరిస్థితి నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్ రోడ్డు మీదుగా ప్రగతినగర్ కు చేరుకునేందుకు ప్రజలు నానా తంటాలు పడేవారు. మరి కొంత మంది తమది గేటెడ్ కమ్యూనిటీ తమ కాలనీలో నుంచి రాకపోకలు బంద్ అని అడ్డుగోడలు కట్టేవారు ఉన్నారు. ఇదంతా మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట, బాచుపల్లి గ్రామాల మధ్య నెలకొన్న వివాదం. దాదాపు 25,000 మంది ప్రజల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న గోడను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఇటీవల కూల్చివేసింది. ఈ సంఘటన మల్లంపేట్ నుంచి బాచుపల్లి క్రాస్ రోడ్స్ ద్వారా ప్రగతి నగర్‌కు వెళ్ళే మార్గంలో జరిగింది. ఈ మార్గం సాధారణంగా 3 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ప్రణీత్ ఏపీఆర్ ప్రణవ్ అంటీలియా' అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్మించిన గోడ కారణంగా ఈ దూరం 8 కిలోమీటర్లకు పెరిగింది. ఈ గోడ వల్ల చాలా రోజుల నుంచి పది కాలనీల నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మల్లంపేట్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేసి, ఈ గోడను తొలగిస్తే 40 నుంచి 60 అడుగుల వెడెల్పు గల రహదారి మళ్లీ ఉపయోగంలోకి వస్తుందని విన్నవించారు. హైడ్రా అధికారులు ఈ ఫిర్యాదును పరిశీలించి, హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌యూడీఏ) ఆమోదించిన లేఅవుట్ ప్రకారం ఈ ప్రాంతం గేటెడ్ కమ్యూనిటీ కాదని గుర్తించారు. హెచ్ఎండీఏ నిబంధన 7 ప్రకారం, రహదారులను అడ్డుకునేలా గోడలు నిర్మించకూడదని స్పష్టంగా ఉంది. దీంతో హైడ్రా ఈ గోడను కూల్చివేసి, రహదారిని పునరుద్ధరించింది. ఈ మూడు రోజులు జాగ్రత్త. దీని ఫలితంగా, బాచుపల్లి-మల్లంపేట్ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ వద్ద ఇటీవల తెరిచిన ఎగ్జిట్ వద్ద హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ చర్యను పర్యవేక్షించారు. కొందరు వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని హెచ్చరించారు. ఈ గోడను కూల్చివేయడం వల్ల దాదాపు 25,000 మందికి పైగా ప్రయోజనం చేకూర్చింది బుద్ధ భవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో హైడ్రాకు రోడ్లు, పార్కులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 49 ఫిర్యాదులు అందాయి. గాజులరామారం, చెంగిచెర్ల, కొత్తగూడ వంటి ప్రాంతాల నుంచి కూడా ఇలాంటి ఫిర్యాదులు వచ్చాయి. హైడ్రాకు ఈ ఫిర్యాదులను పరిశీలించి, చట్టవిరుద్ధ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ చర్యలు ప్రజల రాకపోకలను సులభతరం చేయడమే కాక, పటిష్టమైన పట్టణాభివృద్ధికి దోహదం చేస్తున్నాయి

**ట్రెండింగ్ లో బతుకమ్మ చెరువు...**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత తేడా స్పష్టంగా కనపడుతోందని అంటున్నారు నెటిజన్లు. దీనికి తాజా ఉదాహరణగా బతుకమ్మ కుంటను చూపిస్తున్నారు. ఇది కళ్లముందు కనపడుతున్న మార్పు అని అంటున్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట ప్రాంతంలో ఉన్న బతుకమ్మ కుంటను ఆక్రమణల చెరనుంచి కాపాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా) సాధించిన విజయాల్లో ఇది కూడా ఒకటి. బతుకమ్మ కుంటను కబ్జా కోరల్లోనుంచి రక్షించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు హైడ్రాకు సంబంధిత పత్రాలు అందజేయడంతో తొలి అడుగు పడింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా ఈ కుంటను పరిశీలించి పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేశారు. కొంతమంది ఈ కుంట స్థలం తమది అంటూ హైకోర్టుని ఆశ్రయించినా తుది తీర్పు హైడ్రాకు అనుకూలంగా వచ్చింది. దీంతో నేడు ఇది కొత్తరూపు సంతరించుకుంది. కబ్జా కోరల్లో ఎలా ఉండేది. హైడ్రాకు ముందు బతుకమ్మ కుంట చెరువు సరస్సు పునరుద్ధరణ పనులను చేపట్టింది. మొదటి రెండు ఫోటోలు హైడ్రా సరస్సు పునరుద్ధరణ పనులను చేపట్టడానికి ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో తీసిన బతుకమ్మ కుంట చిత్రాలు అప్పుడు 20 ఎకరాలు.. దాదాపు 20 ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో బతుకమ్మ కుంటగా ఉండేది. క్రమంగా కబ్జాల బారిన పడి అసలు కుంటే కనుమరుగైపోయింది. ప్రస్తుతం ఇందులో కేవలం 6 ఎకరాలు మాత్రమే మిగిలుంది. దాన్ని కూడా కబ్జా చేయాలని చూశారు కొంతమంది. హైడ్రా చొరవతో దానికి బ్రేక్ పడింది. చెరువుని పునరుద్ధరించి అక్కడ పరిసరాల్ని పరిశుభ్రం చేశారు. దీంతో ఇప్పుడు బతుకమ్మ కుంట అందర్నీ ఆకట్టుకుంటోంది. గతంలో బతుకమ్మ కుంట ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది.. అని పోలుస్తూ ఫొటోలను సోషల్ మీడియాలో అప్ లోడ్ చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని అభినందిస్తున్నారు. బతుకమ్మ కుంటను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోయి ఉంటే, ఈపాటికే అది పూర్తిగా కనుమరుగై పోయి ఉండేదని అంటున్నారు. అసలు బతుకమ్మ కుంట అనే జలవనరు కాలగర్భంలో కలసిపోయేదని, అది ఒక ప్రాంతం పేరుగా మాత్రమే మిగిలిపోయేదని చెబుతున్నారు. హైదరాబాద్‌లోని బతుకమ్మ కుంట చెరువును పునరుద్ధరించిన హైడ్రా మరియు రేవంత్ రెడ్డి గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు! మీ కృషితో మా సంప్రదాయ సంబరం మళ్లీ జీవం పోసుకుంది. సీఎం రేవంత్ చొరవ.. తెలంగాణలో 9 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ ఆక్రమణల తొలగింపుకి సిద్ధపడలేదు. పైగా బీఆర్ఎస్ నేతల ప్రోద్బలంతోనే కొన్నిచోట్ల ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ఈ ఆక్రమణలతో హైదరాబాద్ నగరం ముంపుబారిన పడుతోంది. ఏ చిన్న వర్షం వచ్చినా నగరంలో నీరు నిలబడుతోంది. నాళాలు, కుంటలు ఆక్రమించడంతో వర్షపునీరు పోయే దారిలేక రోడ్లు మునిగిపోయేవి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ఆక్రమణల తొలగింపుపై సీరియస్ గా దృష్టిపెట్టారు. విమర్శలు వస్తున్నా ఆయన ముందుకే వెళ్లడానికి నిర్ణయించారు. ఆ ఫలితాలు ఇప్పుడు కళ్లముందు కనపడుతున్నాయి. దీనితోపాటు మూసీ ప్రాజెక్ట్ కూడా పట్టాలెక్కితే హైదరాబాద్ రూపు రేఖలు సమూలంగా మారడం ఖాయం అంటున్నారు

# తప్పుడు ప్రచారం చేస్తే నాశనమైపోతావు కేటీఆర్ : మంత్రి సీతక్క



ములుగు : తప్పుడు ప్రచారం చేస్తే నాశనమైపోతావు కేటీఆర్ అంటూ ఫైర్ మంత్రి సీతక్క అయ్యారు. చిల్లర రాజకీయాలు మానండి నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వివరించండి. కేటీఆర్ మీ చెల్లి నీ మీద దుమ్మెత్తి పోస్తుంది.. ఆమె సంగతి ఏందో చూడు . నాతో పెట్టుకుంటే నీకు వచ్చేది ఏం లేదు. నీలాగా కుల బలము తన బలము అహంకార బలము నా వద్ద లేదు. నాకెవరూ లేరు. ఉన్న అన్న కూడా ఉద్యమంలో చనిపోయాడు. నాకు నియోజకవర్గమే నాకు అండ. ములుగు ప్రజలు దీవిస్తే మంత్రిని అయ్యానని అన్నారు. నువ్వు నిర్వహించిన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు నేను మంత్రయితే కేటీఆర్ తట్టుకోవట్లేదు. అభివృద్ధికి అందరూ సహకరించండి. అబద్ధపు ప్రచారంతో కేటీఆర్ నాశనమైపోతాడు. ఇంట్లో ఆడబిడ్డను నువ్వు కుట్రలు కుతంత్రాలతో వేధిస్తున్నావు. ములుగులో ఇందిరమ్మ పాలన ప్రజాస్వామ్య పాలన సాఫీగా సాగుతోంది . ఇబ్బందులు నిర్బంధాలు లేవు . నా మీద ఉన్న అభిమానాన్ని, ములుగు అభివృద్ధిని అడ్డుకునేందుకు కేటీఆర్ కుట్రలు చేస్తున్నారు . పక్క నియోజకవర్గాలలో చిత్తుగా ఓడిపోయి అక్కడ ఎవరు పట్టించుకోక ఇక్కడికి వచ్చి డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్ నిజంగా మనిషి అయితే పోలీసు రాజ్యం ములుగులో ఉందని నిరూపిస్తావా? మీ హాయంలో మా కార్యకర్తల మీద ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు . లక్ష్మీదేవి పేట, చల్వాయి తో పాటు ఎన్నో గ్రామాల యువకుల మీద మీరు కేసులు పెట్టి వేధించారు..చర్చకు సిద్ధమా? ములుగు లో శాంతియుత వాతావరణం ఉంది ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందని అన్నారు.దొర దురంకారంతో కుట్రలను రాష్ట్ర ప్రజలు ములుగు ప్రజలు అర్థం చేసుకున్నారు. మీరు శాంతియుత ధర్నా చేసుకుంటామని చెప్పి మంత్రుల కాన్వాయ్ ని అడ్డుకునే ప్రయత్నం ఎందుకు చేశారు . మీకు రాజకీయ డ్రామాలు తప్ప.. బాధిత కుటుంబాలను ఆదుకునే సోయి లేదని అన్నారు.ములుగు నియోజకవర్గంలో 90% ఎస్సీ, ఎస్టీ, బీసీ పోలీస్ అధికారులు ఉన్నారు. వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా మీరు ఆరోపణలు చేస్తున్నారు. మీ హయంలో ములుగు నియోజకవర్గంలో మీ మంత్రులు పర్యటిస్తే విపక్ష నేతలను హౌస్ అరెస్టులు చేసేవారు . తాగడానికి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదు మీరు. చల్వాయిలో రమేష్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకుంటే.. మమ్మల్ని నిందించడానికి బుద్ధి ఉండాలి. ఆ కుటుంబాన్నీ పరమార్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చామని అన్నారు. మీరు ప్రజలను పొట్టన పెట్టుకుంటే.. మేము కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం. మీ పాలనలో టిఆర్ఎస్ నేతల వేధింపులకు ఎందరో బలయ్యారు. సూసైడ్ లేఖలు, సెల్ఫీ వీడియోలు తీసుకొని ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్లలో ఇసుక లారీలతో ప్రజలను తొక్కించి చంపించిన చరిత్ర మీది. మంథనిలో అడ్వకేట్ దంపతులను నరికి చంపింది ఎవరు . సిద్దిపేటలో ఆటో డ్రైవర్ శిలాసాగరం రమేశ్ కు డబల్ బెడ్ రూం రాకుండా మీ టీఆర్ఎస్ కౌన్సిలర్ అడ్డుకుంటే సిద్దిపేట కలెక్టరేట్ వద్ద పురుగు మందు తాగి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కొత్తగూడేం అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కొడుకు బీఆర్ఎస్ నేత రాఘవేంద్ర వేధింపులు తాళలేక ఓ కుటుంబం సుసైడ్ చేసుకుంది. మెదక్ జిల్లా రామాయంపేట లో మీ నేతలు వేధిస్తున్నారని తల్లి, కొడుకు పద్మ,సంతోష్ సెల్ఫీ తీసుకుని పెట్రోల్ పోసుకుని సుసైడ్ చేసుకున్నారు. మీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరింపులతో ఖమ్మంలో సాయి గణేష్ అనే యువకుడు సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా ఎందరో మీ వేధింపులకు బలి అయితే.. ఆ కుటుంబాను కనీసం పరామర్శించలేదని అన్నారు.ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా దూషించే కేటీఆర్ కు సంస్కారం లేదు.. కేటీఆర్ కు ఒళ్లంతా దూరంకారమే. ఉద్యమ సమయంలో జనాలను రెచ్చగొట్టి చనిపోయేలా చేసి మీరు మాత్రం అధికారం అనుభవించారు . బీఆర్ఎస్ బ పదేళ్ల పాలనలో ములుగులో కనీసం వేయి ఇండ్లు కట్టించి ఇవ్వలేదు.. మీకు మాట్లాడే అర్హత ఉందా? అధికారం కోసం చావులకు ప్రేరేపించిన చరిత్ర మీదని అన్నారు.

# రేవంత్ కి దమ్ము ఎక్కడ...



**హైదరాబాద్ :** 18 నెలలుగా రాష్ట్రంలోని 70 లక్షల రైతులు, కోట్లాది ప్రజలను నోటికొచ్చిన హామీలతో మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మొత్తం 420 హామీలిచ్చి, రచ్చ చేశారు కానీ చర్చకు రమ్మంటే పరార్ అవుతారని సెటైర్లు వేశారు. కేసీఆర్ వస్తారా, కేటీఆర్ వస్తారా అని సీఎం రేవంత్ రెడ్డి ఛాలెంజ్ చేశారు. ఆ సవాల్ స్వీకరించడంతో పాటు సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఉదయం 11 గంటలకు చర్చకు రావాలని సూచించాం. మాట మీద నిలబడని నేత రేవంత్ రెడ్డి కనుక ప్రెస్ క్లబ్ లో మేం హాల్ బుక్ చేసి చర్చకు రమ్మని పిలిస్తే ఏ నేత కూడా రాలేదన్నారు.ఏ బేసిన్ ఏ నదిలో ఉందో కూడా తెలియని నేత తెలంగాణ ముఖ్యమంత్రా అని జనం నవ్వుకుంటున్నారు. నీళ్లు , నిధులు, నియామకాలు తెలంగాణ నినాదం. వీటిని రేవంత్ రెడ్డి ఎలా ఫాలో అవుతున్నాడంటే.. ఏపీ సీఎం చంద్రబాబుకు కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. కోవర్టు పాలన నడుస్తోంది. నీళ్లు ఆంధ్రాకు పోతే, నిధులు ఢిల్లీకి పోతున్నాయి. నియామకాలు ఆయన తొత్తులకు ఇస్తున్నాడు రేవంత్ రెడ్డి. ఆయన ఢిల్లీ పర్యటనపై ఓ కాంగ్రెస్ నేతతో మాట్లాడాను. రేవంత్ ఢిల్లీ ఎందుకు పోయాడని అడిగితే ఎరువుల బస్తాల కోసం ఢిల్లీకి వెళ్లాడని తెలిసింది. దూడకు గడ్డెయ్యాలని వెనుకటికి ఒకడు తాటిచెట్టు ఎక్కాడంట. రేవంత్ ఏ బస్తాలు తీసుకుని ఢిల్లీకి పోతున్నాడు. ఆయన ఓ పేటీఎం. పేమెంట్ కోటాలో సీఎం పదవి తెచ్చుకున్నాడు. రైతులు, మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, యువతపై ప్రేమ లేదు. హామీలు అమలు చేస్తలేదు. రైతు బంధు అయిపోయిందన్నారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గం కోడంగల్ లో 670 మంది రైతులకు రైతు భరోసా రాని వారి జాబితా ఇదీ. రుణమాఫీ కాలేదని ఆత్మహత్య చేసుకున్న 600 మంది రైతుల వివరాలు మేం వెల్లడిస్తున్నాం. ఎరువుల కొరతతో రైతులు అల్లాడుతున్నారు. ఒక్క ఆధార్ కు ఒక్క బస్తా ఇస్తాడంట. గత రోజులు తెస్తామన్నాడు. నిజంగానే కరెంట్ కోత, ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో నిల్చునే రోజులు తెచ్చాడు. ఇందిరమ్మ రాజ్యం అంటే అక్రమ కేసులు, అణచివేతలు, ఎమర్జెన్సీని గుర్తుకుతెచ్చేలా పాలన చేస్తున్నాడు. నల్లబాలు అనే సోషల్ మీడియా వ్యక్తి ప్రశ్నించాడని కేసు పెట్టి అరెస్ట్ చేశారు. కేసీఆర్ హయాంలో రుణమాఫీ జరిగింది. పంట కాలానికి ముందే రైతు బంధు నగదు ఏ ఇబ్బంది లేకుండా వారి ఖాతాల్లో జమచేశాం. ఇప్పుడు మళ్లీ పైరవీల పాలన వచ్చింది. రైతుల ఆత్మహత్యలతో కూడా రేవంత్ రెడ్డి చలించడం లేదు. వర్షాకాలం వచ్చినా పంపు హౌజ్ లు బోర్లు ఆన్ చేసి నీళ్లు వదలడం లేదు. రైతులు కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తూనే ఉంటుంది. ఈరోజు చర్చకు రాకపోయినా ఎప్పుడు చర్చకు వస్తారో డేట్, ప్లేస్ చెప్పాలని ' మరోసారి ఛాలెంజ్ చేశారు కేటీఆర్. మీ ఇంటికి రమ్మంటావా రైతుల సంక్షేమంపై రేవంత్ అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే 600మందికి పైగా రైతులకు రైతు బంధు రాలేదన్నారు. రైతుల మరణాల లిస్టు కూడా రెడీగా ఉందని చెప్పారు. రైతుల సంక్షేమంపై చర్చించడానికి రేవంత్ స్థాయికి కేసీఆర్ అవసరం లేదని అన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌కు కేటీఆర్ మరో సవాల్ విసిరారు. "సీఎం చర్చ ఎక్కడ పెట్టినా ఒకే. చర్చ కోసం అవసరమైతే రేవంత్ తన ఇంటికి రమ్మన్నా వెళ్తా. చర్చించే సత్తా లేకపోతే మరోసారి సవాళ్లు విసరొద్దు" అని కేటీఆర్ అన్నారు. దమ్ముంటే రేవంత్ చర్చకు రావాలి.. లేదా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారురేవంత్ రెడ్డి హామీలు అమలుచేయకుండా రంకెలు వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు పక్కా అమలు చేస్తామంటూ బాండ్ పేపర్లు రాసిచ్చారు.. ఇప్పుడు అవి ఎటుపోయాయంటూ ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణను సాధిస్తే.. రేవంత్ పాలనలో నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి తరలిపోతున్నాయని ఆరోపించారు. ఎరువుల బస్తాల కోసం రేవంత్ ఢిల్లీ వెళ్లలేదని.. ఢిల్లీ పెద్దల కోసం ఏం బస్తాలు తీసుకెళ్లారో అందరికీ తెలుసని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే అణిచివేతలు, అక్రమ కేసులు అన్న కేటీఆర్.. కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లారు. రైతు సంక్షేమంపై అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధమని ప్రకటించారు. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామన్నారు. అసెంబ్లీకి రమ్మంటే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారని విమర్శించారు. రైతుల సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ పెట్టాలని కేసీఆర్ లేఖ రాస్తే పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కేటీఆర్ ముందు కేసీఆర్‌తో లేఖ రాయించాలని సూచించారు.

# దమ్మాయిగూడలో అక్రమ షెడ్ల దందా :అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల మండిపాటు

**దమ్మాయిగూడ తెలంగాణ షాన్, జూలై 09:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ ఎత్తున షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, టౌన్ ప్లానింగ్ అధికారులు కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్నప్పటికీ స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా, ఓ అక్రమ షెడ్డు నిర్మాణం టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని తెలిసినా వారు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.



దీని వెనుక అధికారులకు భారీ ఎత్తున ముడుపులు అందాయనడానికి ఈ అక్రమ నిర్మాణాలే నిలువెత్తు నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిజాయితీపరులైన అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి అక్రమ షెడ్ల నిర్మాణాలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు వెంటనే కదలకపోతే, మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు మరింతగా పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# బీహార్ లో మహిళలకు ఉద్యోగాలలో 35 శాతం రిజర్వేషన్

పాట్నా : త్వరలోనే జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు నేతలు తాయిలాలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వరాల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మంగళవారం సంచలన ప్రకటనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోని అన్ని వర్గాల్లోని మహిళలకు ఏకంగా 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు ప్రకటించారు. బీహార్ శాశ్వత నివాసితులుగా ఉన్న మహిళలకు ఈ రిజర్వేషన్ వర్తిస్తుందని ఆయన తెలిపారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలో అన్ని వర్గాలు, స్థాయిలు, రకాల పోస్టులకు ప్రత్యక్ష నియామకాలలో బీహార్ శాశ్వత నివాసితులైన మహిళలకు ప్రత్యేకంగా 35% రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు సీఎం నితీష్ కుమార్ పేర్కొన్నారు. అన్ని స్థాయిలు, విభాగాల్లోని ప్రభుత్వ సేవలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీహార్‌లో అధిక మంది మహిళలు శ్రామిక శక్తిలోకి ప్రవేశించి పరిపాలనలో పెద్ద పాత్ర పోషించేలా చూడటమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యమని సీఎం నితీష్ తెలిపారు. పాట్నాలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.యువతకు తమ ప్రభుత్వ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తూ 'బీహార్ యువజన కమిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు నితీష్ కుమార్ ప్రకటించారు. ఇది రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన కొత్త చట్టబద్ధమైన సంస్థని స్పష్టం చేశారు. బీహార్ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడానికి, వారికి శిక్షణ ఇవ్వడానికి, సమర్థులుగా మార్చడానికి బీహార్ యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం కూడా తెలిపినట్లు ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలోని యువత అభ్యున్నతి, సంక్షేమానికి సంబంధించిన అన్ని విషయాలపై బీహార్ యువజన కమిషన్ ప్రభుత్వానికి సలహా ఇస్తుందన్నారు. యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటుందన్నారు.ఈ కమిషన్‌లో ఒక చైర్‌పర్సన్, ఇద్దరు వైస్-చైర్‌పర్సన్‌లు, ఏడుగురు సభ్యులు ఉంటారు. వీరందరూ 45 ఏళ్లలోపు వారే. రాష్ట్రం వెలుపల చదువుతున్న, ఉద్యోగం చేస్తున్న బీహార్ విద్యార్థులు, కార్మికుల ప్రయోజనాలను కాపాడుతూ రాష్ట్రంలోని ప్రైవేట్ రంగ ఉద్యోగాలలో స్థానిక యువతకు ప్రాధాన్యత లభించేలా కూడా ఇది పర్యవేక్షిస్తుందని బీహార్ యువజన కమిషన్ విధివిధానాల గురించి వివరించారు. అలాగే మద్యం, మాదకద్రవ్య దుర్వినియోగం వంటి సామాజిక దురాచారాల అరికట్టడంలోనూ ఈ కమిషన్ బాధ్యత వహిస్తుంది ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తెలిపారు.



# 'కాంతార' ఫ్యాన్స్ గెట్ రెడీ...

# ప్రీక్వెల్ రిలీజ్ ఎప్పుడంటే



రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కాంతార'. 2022లో వచ్చిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అయితే ఈ సినిమాకు ప్రీక్వెల్ 'కాంతారా %-% ఛాప్టర్ 1' (కాంతారకు పూర్వం జరిగిన కథ) రానుందని చాలా కాలం క్రింద ప్రకటించారు. కానీ, చిత్రానికి సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి అప్‌డేట్ రాలేదు. తాజాగా రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా కాంతార %-% ఛాప్టర్ 1 సినిమా అప్‌డేట్‌ని ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. పోస్టర్‌లో యోధడిగా రిషబ్ మనకి కనిపిస్తున్నారు. "ఇతిహాసాలు పుట్టిన చోట గర్జనలు ప్రతిధ్వనిస్తాయి. 'కాంతార'తో లక్షలాది మందిని కదిలించిన కళాఖండానికి ఇది ప్రీక్వెల్. ఈ చిత్రం వెనుక ఉన్న శక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు. అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. పురాణానికి నాంది. హృదయాలను కదిలించే కథకు తిరిగి స్వాగతం" అని పోస్టర్‌కి క్యాప్షన్ జత చేసింది. దీంతో ఈ సినిమా విడుదల వాయిదా పడుతుంది అనే వార్తలకు చెక్ పెట్టింది చిత్ర యూనిట్. రిషబ్ స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని హొంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. కదంబుల కాలంలో జరిగే కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు రిషబ్.


## నన్ను శాశ్వతంగా భరించలేరు



యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ రెజీనా తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు దక్కించుకుంది. చైన్నైకి చెందిన ఈ ముద్దుగుమ్మ తెలుగుతో పాటు తమిళంలోనూ పలు చిత్రాల్లో నటించి ఆడియెన్స్‌లో స్పెషల్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది.. టాలీవుడ్ ద్వితీయ శ్రేణి హీరోలతో నటించి మెప్పించింది. సోషల్ మీడియాలోనూ రెజీనా ఎంతో యాక్టివ్‌గా కనిపిస్తూ ఉంటుంది. ఇటీవల ఇంటర్వ్యూల్లోనూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేస్తున్నది. కాగా తాజాగా తనకు పెళ్లిపై ఉన్న అభిప్రాయాన్ని పంచుకుంది.

తన విషయంలోనూ పెళ్లి సెట్ అవ్వదని చెబుతూ షాకింగ్ కామెంట్స్ చేసింది. "ఎలాంటి మగవారైనా నన్ను శాశ్వతంగా భరించలేరు. నేను లైఫ్ లాంగ్ కమిట్‌మెంట్స్ ఇవ్వాలని ఇప్పుడు అనుకోవడం లేదు. కానీ డేటింగ్ వరకు అయితే ఓకే' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక ప్రస్తుతం రెజీనా తమిళంలో రెండు చిత్రాలు మూక్తి అమ్మన్ 2, ఫ్లాష్ బ్యాక్, హిందీలో సెక్షన్ 108 వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## 'రామాయణ' చిత్రం.. వారిద్దరికి భారీ పారితోషికం..!





బాలీవుడ్‌లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా.. సీతగా సాయి పల్లవి నటిస్తోంది. అయితే తాజాగా ఈ సినిమా కోసం వీరిద్దరి పారితోషికానికి సంబంధించిన వార్త ఒకటి వైరల్ అవుతోంది. 'రామయణ' సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఒక భాగానికి రూ.75 కోట్ల చొప్పున రణ్‌బీర్ రూ.150 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకుంటున్నాడని సమాచారం. ఇక సాయిపల్లవి కూడా ఈ సినిమాకి భారీ రెమ్యూనరేషన్ అందుకుంటుందట. ఆమె రూ.15 కోట్ల ఈ సినిమాకి పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రూ.1600 కోట్లతో భారీ బడ్జెట్‌తో రామయణ సినిమా రూపొందుతోంది. నమిత్ మల్హోత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, కన్నడ రాక్‌స్టార్ యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కాగా, యశ్ ఈ చిత్రంలో రావణాసురుడి పాత్రలో నటిస్తున్నాడు. రవి దూబే లక్ష్మణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా కనిపించనున్నారు. వివేక్ ఒబెరాయ్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా, కాజల్ అగర్వాల్, అరుణ్ గోవిల్, షీబా చద్దా ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా తొలి భాగం 2026, దీపావళికి, రెండో భాగం 2027, దీపావళికి విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది.

## వైద్యురాలు ఫిర్యాదు... మహేష్ బాబుకు నోటీసులు



రియల్ ఎస్టేట్ సంస్థ సాయి సూర్య డెవలపర్స్‌పై నమోదయిన కేసులో నటుడు మహేష్‌బాబుకు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫారం నోటీసులు జారీ చేసింది. మహేష్ బాబు ఫోటోతో ఉన్న బ్రోచర్‌తో ప్రమోషన్ చేయడంతోనే ఫ్లాట్ కోనుగోలు చేశానని ఓ వైద్యురాలి ఫిర్యాదులో పేర్కొనడంతో వినియోగదారుల ఫారం ఈ నోటీసులు ఇచ్చింది. బాలాపూర్ గ్రామ పరిధిలోని సాయి సూర్య డెవలపర్స్ లే అవుట్ వేశామని చెప్పడంతో ఆకర్షితులైన ఓ వైద్యురాలు, మరో వ్యక్తితో కలిసి చెరో ప్లాటు కొనడానికి రూ. 34.80 లక్షలు చెల్లించారు. అనంతరం ప్రతిపాదిత ప్రాంతంలో లే అవుట్ లేదని తెలుసుకొని కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాన్యాన్ని అడిగగా సంస్థ ఎండి సతీష్ చంద్రగుప్తా కేవలం రూ. 15 లక్షలు మాత్రమే వెనక్కి తిరిగి ఇచ్చారని పేర్కొంటూ భాధితురాలు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫారం కోర్టులో ఫిర్యాదు చేశారు. సంస్థతో పాటు ప్రచార కర్తగా ఉన్న మహేష్ బాబును ప్రతివాదులుగా చేర్చారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన వినియోగదారుల ఫారం సాయి సూర్య డెవలపర్స్ సంస్థ ఎండి సతీష్ చంద్రగుప్తా, ప్రమోషన్ చేసిన మహేష్ బాబులకు మంగళవారం నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందిన వారు న్యాయవాదులతో లేదా వ్యక్తిగతంగా హాజరు కావచ్చుని పేర్కొంది. అనంతరం ఈ కేసు నెల 7వ తేదీకి వాయిదా వేసింది.

## కన్నప్పలో ఆ పాత్రలు ఇరిటేషన్ తెప్పించాయి: తమ్మారెడ్డి భరద్వాజ



మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప'. జూన్ 27వ తేదీన విడుదలైన ఈ సినిమా మంచి టాక్ తెచ్చుకుంది. సినిమాపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. తాజాగా ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ సినిమా గురించి మాట్లాడారు. సినిమా బాగుందని చెప్పిన ఆయన.. అన్ని కోట్లు పెట్టి సినిమా తీయాల్సిన అవసరం లేదని అన్నారు. సినిమా రూ.200 కోట్లతో నిర్మిస్తే.. పది రోజుల్లో కేవలం రూ.50 కోట్లు కూడా వసూలు చేయలేకపోయిందని.. దీంతో నిర్మాత మోహన్‌బాబుకు తీవ్ర నష్టం వచ్చినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. సినిమా గురించి తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించాలనే ఆలోచన చేశారు కానీ.. భక్తి తగిన జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. భక్తే ప్రధానంగా సినిమా తీసి ఉంటే రూ.1000 కోట్ల కలెక్షన్లు వచ్చేవని ఆయన పేర్కొన్నారు. సినిమాలో అందరూ చాలా బాగా నటించాని కితాబిచ్చిన ఆయన.. శివుడిగా అక్షయ్ కుమార్, పార్వతిగా కాజల్ అగర్వాల్‌ను చూస్తుంటే తనకు ఇరిటేషన్ వచ్చిందని తెలిపారు. కన్నప్ప సినిమా చూస్తున్నంత సేపు 'అన్నమయ్య' సినిమా కాన్సెప్ట గుర్తుకు వచ్చిందని పేర్కొన్నారు. ఔట్ డేటెడ్ కాన్సెప్ట్ తీసుకున్నారని అన్నారు. ఏదేమైనప్పటికీ.. కన్నప్ప విషయంలో బాగా కష్టపడిన విష్ణును అభినందించాలని తెలిపారు. కానీ, ఆ కష్టానికి తగిన ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాను కొందరు ట్రోల్ చేసినా.. బ్యాడ్ రిపోర్టు రాలేదని.. ఒక్కసారి అయినా చూడాల్సిన సినిమాగా రివ్యూలు వచ్చాయన్నారు.

## చిరంజీవి సినిమాలో నటిస్తున్నాను.. కన్ఫామ్ చేసిన వెంకటేష్



సక్సెస్‌ఫుల్ దర్శకుడు అనిల్ రావిపూడితో మెగాస్టార్ చిరంజీవి సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'మెగా 157' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాలో చిరు.. తన అసలు పేరైన శివ శంకర్ వరప్రసాద్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్. అయితే ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ నటిస్తున్నారని వార్తలు వచ్చాయి. అయితే ఆ వార్తను వెంకటేష్ కన్ఫామ్ చేశారు. అమెరికాలో జరుగుతున్న 'నాట్స్ 2025'లో వెంకీ మామ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన తన సినిమాలకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. ప్రస్తుతం త్రివిక్రమ్‌తో ఓ సినిమా చేస్తున్నానని చెప్పిన వెంకటేష్.. చిరంజీవి సినిమాలో అతిథి పాత్రలో నటిస్తున్నానని వెల్లడించారు. ఈ చిత్రంలో తన పాత్ర చాలా ఫన్నీగా, నవ్వులు పూయించేలా ఉంటుందని అన్నారు. అలాగే మీనాతో కలిసి దృశ్యం 3 సినిమా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది అనిల్ రావిపూడితో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో హిట్ కొట్టామని.. మళ్లీ మేమిద్దరం కలిసి రాబోతున్నట్లు స్పష్టం చేశారు. తన స్నేహితుడితో కలిసి మరో భారీ ప్రాజెక్టులో నటిస్తున్నానని, ఆయన తెలుగులో పెద్ద స్టార్ అని వెంకీ మామ తెలిపారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com